వైభవంగా ఉగాది వేడుకలు

- పంచాంగ పఠనాలు
- పలువురుకి పురస్కారాల ప్రదానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో పంచాంగ పఠనాలు, చేసి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వివిధ రంగాల్లో సేవలు చేసిన వారికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. స్థానిక సాహిత్య మండలి భవనంలో సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. సంగీత దర్శకులు ఎస్‌పీఎస్ వాసు సంగీత కచేరితో కార్యక్రమం ప్రారంభమైంది. సాహిత్య కార్యక్రమానికి గరికిపాటి కాళిదాసు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసన మండలి సభ్యులు షేక్ సాబ్జి మాట్లాడుతూ విద్యార్థులు తెలుగులో కూడా చదువుకునే హక్కును పొందడానికి శాసనమండలిలో పోరాటం చేస్తానని అన్నారు. సాహితీవేత్త లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రతిబింబించేదే నిజమైన సాహిత్యమన్నారు. నేతి సత్యనారాయణ శాస్త్రి పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా పుల్లాభొట్ల శ్రీరామ మూర్తి స్మారక సాహిత్య పురస్కారాన్ని కల్యాణశ్రీకి అందజేశారు. పీఆర్‌కే కళా ట్రస్ట్ ఉగాది కళా పురస్కారాన్ని పౌరాణిక సంగీత దర్శకులు వి.సురేష్ రాజుకు అందించారు. సంగీత రంగం నుంచి సయ్యద్ అలివేలు మంగ తాయారు, జీవీ రత్న శిరీష, సాహిత్య రంగంలో శ్రీ నాగాస్త్రి, పౌరాణిక నాటక రంగంలో వి.రామాంజనేయ సిద్ధాంతి, ఎం.రాజగోపాలకృష్ణ చౌదరి, సాంఘిక నాటక రంగంలో డి.రాములు, నాట్య రంగంలో బి.వర్షిణికి ఉగాది పురస్కారాలను అందజేశారు. అనంతరం కవి సమ్మేళనంలో షడ్రుచుల్లాంటి కవితలను కవులు వినిపించారు. శ్రీ రామంజనేయ నాట్య మండలి సంస్థ ఆధ్వర్యంలో శ్రీ రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలపాటి నాగేశ్వరావు, సత్యవతి, పెదపాటి రామకృష్ణ, ఎండీ ఖాజావలి, డి.హేమసుందర్, గండికోట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


సాహిత్య మండలిలో ఉగాది పురస్కారాలు అందుకున్న సేవా మూర్తులు


బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో..


ఉగాది వేడుకలో పాల్గొన్న వృద్ధులు

బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో..
స్థానిక విజయా గార్డెన్స్‌లోని సంఘ కల్యాణ మండపంలో ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ పంచాగకర్త కాశీభొట్ల పార్వతీశ్వర శర్మ పంచాగం పఠనం చేశారు. సంఘసేవకులు రామచంద్రుని హరిప్రసాద్, పసోదూరి కనకదుర్గలకు ఉగాది సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఎంబీఎస్ శర్మ మాట్లాడుతూ మానవ జీవితం కాలాధీనమని, కష్టనష్టాలను సమన్వయపరుచుకుని జీవనం కొనసాగించాలనే ఆధ్యాత్మిక రహస్యాన్ని ఉగాది పండుగ మానవ జాతికి తెలియజేస్తోందని వివరించారు. ఏప్రిల్ 2న తెలుగు రాష్ట్రాల బ్రాహ్మణ వివాహ సదస్సు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా వేదపాఠశాల విద్యార్థుల వేద పఠనం ప్రశంసలందుకుంది. శ్రీశ్రీ విద్యా సంస్థల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శోభకృత నామ సంవత్సరం నూతన పంచాంగాన్ని సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎం. బానుమూర్తి, డీవీఎస్ సుబ్బారావు, కేవీఎన్ శర్మ, తమ్మెర రామారావు, మైలవరపు గురు శర్మ, ఎంఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ఉగాది వేడుక
ఏలూరు రూరల్ : ఉగాది సందర్భంగా సత్రంపాడు వాకర్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమం నిర్వహించారు. రామకృష్ణాపురంలో సత్యసాయి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. స్వీట్లు, పండ్లు పంచారు. వృద్ధులను సంతోష పెట్టేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అసోసియేషన్ అధ్యక్షులు పి.ఆదినారాయణ, కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. ట్రెజరర్ జి.సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు కేఎస్ చంద్రశేఖర్, సభ్యులు వీవీ సత్యనారాయణ, సుధాకర్, వృద్ధులు సత్యసాయి చిత్రపటానికి పూలమాలు వేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శోభకృత్ నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లు శ్రీవారి ఆలయాల్లో ఉదయం సుప్రభాత సేవలు, నిత్యార్చనలు నిర్వహించారు. విశేష కుంకుమ పూజలు చేసి దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణలు చేశారు. లలితా సహస్రనామ పారాయణలు, విష్ణు సహస్రనామ పారాయణలు నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. పత్తేబాద కనకదుర్గమ్మ, చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి, రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి, అగ్రహారం భూనీళా సమేత జనార్దన స్వామి, నగరేశ్వర స్వామి, పవర్‌పేట వాసు, కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి తదితర ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను, స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


విశేష అలంకరణలో పత్తేబాద్ కనకదుర్గమ్మ


ఆర్ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి

క్లుప్తంగా

నేడు భగత్ సింగ్ వర్ధంతి సభ

ఏలూరు (టూటౌన్): భారత స్వాతంత్ర్య విప్లవకారుడు భగత్ సింగ్ 92వ వర్ధంతి సభ స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు ఎస్ రామ్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రగతి శీల వాదులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు


వాటర్‌ప్లాంట్ వద్ద మరమ్మతు చేస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : ఏలూరు మండలం జాలిపూడిలో వాటర్‌ప్లాంట్‌కు దాతలు మరోసారి మరమ్మతులు చేపట్టారు. ప్లాంట్ అంతర్భాగంలో ఫిల్టర్లను అభివృద్ధి చేశారు. ప్లాంట్ చుట్టూ ఫ్లోరింగ్ చేయించారు. 10 ఏళ్ల క్రితం గ్రామస్తులకు సురక్షిత తాగునీరు అందించాలనే తలంపుతో దాత అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం ఈ ప్లాంట్ నిర్మించారు. కొద్దికాలం తర్వాత మరమ్మతులకు గురయింది. మళ్లీ ఇప్పుడు దాత కుటుంబీకులు ప్లాంట్ పూర్వస్థితికి తీసుకురావడంపై వైఎస్సార్‌సీపీ గ్రామాధ్యక్షుడు మధ్యాహ్నపు వాసు హర్షం వ్యక్తం చేశారు.

25 నుంచి సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం


గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

దెందులూరు: వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 25 నుంచి సౌత్ సెంట్రల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరుగుతాయని కళాశాల ఏఓ టీఎస్ కరుణానిధి, ప్రిన్సిపాల్ రాధాకృష్ణ అన్నారు. గోపన్నపాలెం వ్యాయామ కళాశాల, ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం, కంచికచర్ల కళాశాల, హేలాపురి కళాశాలలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల నిర్వహణకు బుధవారం సాయంత్రం మ్యాచ్‌ల మధ్య పోటీల మధ్య టాస్‌లు వేశారు. గ్రౌండ్ ఏర్పాట్లను పరిశీలించారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

పెదవేగి : రాట్నాలమ్మ హుండీ లెక్కింపు గురువారం ఉదయం 9 గంటలకు ఆలయంలో నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆసక్తి గల భక్తులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన వచ్చని పేర్కొన్నారు.

జావ చలివేంద్రం ప్రారంభం


రాగిజావ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నూర్జహాన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా స్థానిక సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మెయిన్ బజారులోని పయిడేటి రామారావు జ్యూయలరీ దుకాణం వద్ద ఏర్పాటు చేసిన రాగిజావ చలివేంద్రాన్ని నగర మేయర్ షేక్ నూర్జహాన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజల, పాదచారుల దాహార్తిని తీర్చడానికి సత్యసాయి సేవా సంస్థలు చేస్తున్న సేవా కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీ కార్యక్రమంలో సైతం సత్యసాయి సేవా సంస్థల సహకారం ఉందని చెప్పారు. అవసరమైన వేళల్లో, ఆపద సమయాల్లో ప్రజలను ఆదుకోవడానికి సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు ఎప్పుడూ ముందుండడం వారి సేవాతత్పరతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వంకదారు ప్రవీణ్, పయిడేటి రామారావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో విద్యుత్ అంతరాయం

పెదపాడు: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపడటంతో సాయంత్రం ఐదు గంటల నుంచి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు మరమ్మతులు చేట్టారు. చిరు వ్యాపారులు కొంతమేర ఇబ్బందులు పడ్డారు.

కొవ్వలిలో అంకమ్మ తల్లి జాతర


అంకమ్మతల్లిని దర్శించుకుంటున్న నాయకులు

దెందులూరు: కొవ్వలి గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో తులతూగాలని రజక సంఘం ఆధ్వర్యంలో కొవ్వలిలో అంకమ్మ తల్లి జాతర నిర్వహించారు. ముందుగా వీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రజక సంఘం జిల్లా, మండల, గ్రామ నాయకులు ముళ్లపూడి వెంకటేశ్వరరావు, గొవ్వాడ చంటి, గొవ్వాడ నాగరాజు, కోటి, రజక సంఘం నాయకులు భక్తులు పాల్గొన్నారు.

అల్లాహ్ దయకు పాత్రులు కావాలి

- మేయర్ నూర్జహాన్, పెదబాబు దంపతులు
- 20 మసీదులకు జావ సరుకుల పంపిణీ


ముస్లింలకు జావ సరుకులు అందజేస్తున్న మేయర్ నూర్జహాన్ దంపతులు

ఏలూరు టౌన్: రంజాన్ మాసంలో ముస్లింలంతా భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తూ అల్లాహ్ దయకు పాత్రులు కావాలని ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ నూర్జహాన్ సూచించారు. బుధవారం స్థానిక పవర్‌పేటలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని సుమారు 20 మసీదులకు రంజాన్ పండుగ నెలరోజులకు సరిపడా సుమారు రూ.5 లక్షల విలువైన జావ సరుకులు బొంబాయి రవ్వ, ఆయిలు, పెసర పప్పు మేయర్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు చేతుల మీదుగా మసీదు పెద్దలకు అందజేశారు. అంజుమన్ కమిటీ పెద్దల విజ్ఞప్తి మేరకు గత ఏడేళ్లగా ఏలూరు నగరం, చుట్టు పక్కల ఉన్న సుమారు 20 మసీదులకు జావ సరుకులను ఎస్ఎంఆర్ పెదబాబు సహకారంతో అందిన్నట్టు మేయర్ నూర్జహాన్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలుచేస్తోన్న పథకాలను ఏలూరులోని ప్రతి ముస్లింకీ సక్రమంగా అందేలా ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాలిచ్చారని. వీటి అన్నిటిని ముస్లింలు ఉపయోగించుకోవాలని మేయర్ నూర్జహాన్ పెదబాబు కోరారు. పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ పెదబాబు ముస్లింలకు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంజుమన్ ప్రెసిడెంట్ సులేమాన్, సెక్రటరీ అమీర్ జాని, కార్పొరేటర్ ఇలియాస్ పాషా, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు రాజా అహ్మద్, ఇక్బాల్, సైద్బాజి దర్గా సాబీర్ హుస్సేన్, చౌక్ మసీద్ సెక్రెటరీ అన్వర్, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లింపుపై వడ్డీ రాయితీ

నగర రెవెన్యూ అధికారి అరుణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపులపై ప్రభుత్వం కల్పిస్తున్న వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్-1 టి.అరుణ ప్రజలకు సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ఆదేశాలతో బుధవారం సెలవు రోజు కావటంతో రెవెన్యూ సిబ్బంది నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీర్ఘకాలికంగా పన్నులు చెల్లించని వారి ఇళ్లకు నీటి కనెక్షన్ కట్ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఆఫీసర్ అరుణ మాట్లాడుతూ దీర్ఘకాలంగా పన్నులు చెల్లించకపోవటంతో వడ్డీ అధికంగా పడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను చెల్లింపులపై వడ్డీ రాయితీ ఇవ్వటంతో ప్రజలకు ఎంతో ఊరట ఇస్తుందని అన్నారు. ఈనెల 31తేదీ లోపు పన్ను బకాయిలు మొత్తం చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కోరారు. నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలు ఆస్తి పన్ను బకాయిలు సకాలంలో చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సౌకర్యార్థం సెలవు రోజుల్లోనూ పన్నుల చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ డ్రైవ్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నంబూరి రవి, బిల్ కలెక్టర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


వంగాయగూడెం జెండాచెట్టు సెంటర్‌లో పన్ను చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: మహిళలు ఆర్థిక ప్రగతికి జగనన్న ఆసరా పథకం దోహదపడుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మహిళా సాధికారత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 87 లక్షల మంది మహిళలకు రూ.6,500 కోట్ల నగదును నేరుగా బటన్ నొక్కి వారి బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి జమ చేయడం దెందులూరు చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే చారిత్రాత్మక అంశమన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 53,350 మహిళలకు రూ.53 కోట్ల 60 లక్షలు లబ్ధి చేకూరడం ఎమ్మెల్యేగా తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. దిశ, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలతో పాటు అనేక పథకాలు పాదయాత్రలో చెప్పనివి కూడా అమలు చేస్తూ కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ మహిళా పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్ నిరూపించుకున్నారన్నారు. కార్యక్రమంలో కనకదుర్గమ్మ తల్లి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, అప్పన ప్రసాద్, మెట్లపల్లి సూరిబాబు, తేరా ఆనంద్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, ఎంపీటీసీలు తాళ్లూరి నాగరాజు, తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసు బాబు, చల్లా మేరిరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్, నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పెదపాడు: మండలంలోని అప్పనవీడు గ్రామంలో వేంచేసియున్న అభయాంజనేయస్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ అర్చకులు ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కొత్త సంవత్సరంలో నక్షత్ర, రాసుల సంచారంతో ప్రజలకు కలిగే మంచి కార్యక్రమాలపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నెర్సు నాగభూషణం, పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ సుంకర సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ సిబ్బందికి అర్చకులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసారు. పెదపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.


అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు



కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	48-64
వంకాయలు (తెలుపు)	32	ములక్కాడలు	10-12
బెండకాయలు	48	కంద	46
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	36
కాకర కాయలు	30-40	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	66
బీరకాయలు (పందిరి)	50	అల్లం	100
క్యాబేజీ	25	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	24	పాలకూర	10
దొండకాయలు	34	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	08
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	30-40	బజ్జీ	60
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	26-30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	26
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	17

పెరుగ్గూడెంలో పాటెమ్మ తల్లి ఉత్సవాలు


పాటెమ్మ తల్లి ఆలయంలో భజన చేస్తున్న దృశ్యం

దెందులూరు: చల్లచింతలపూడిలో పాటెమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, పెరుగ్గూడెం మాజీ సర్పంచ్ యలమర్తి హేమలత, చల్లచింతలపూడి గ్రామ సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, మాజీ సర్పంచ్ ఎం.మోహనరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ఆలయ ప్రదక్షిణ, భజనలు నిర్వహించారు. గురువారం మహిళలతో కలశ పూజ, ఊరేగింపు నిర్వహిస్తామని చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు.

కోడిపందేలు, పేకాట శిబిరాలపై దాడులు

ద్వారకాతిరుమల : మండలంలో కోడిపందేలు, పేకాట స్థావరాలపై బుధవారం పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడిపందేలు వేస్తున్న 18 మందిని, పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 19 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై టి.సుధీర్ కథనం ప్రకారం. మండలంలోని గుండుగొలనుకుంట గ్రామంలో కోడిపందేలు వేస్తున్న 5 గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 2,600 నగదు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులను, అలాగే కోడిగూడెం గ్రామంలో 6 గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 1,100 నగదు, ఒక కోడి పుంజు, రెండు కోడి కత్తులను, రాళ్లకుంట గ్రామంలో 5 గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 5,900 నగదు, రెండు కోడి పుంజులను, సత్తాల గ్రామంలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 600 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వెంకటకృష్ణాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 8,800 నగదు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటిపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

శ్రీవారి పథకాలకు రూ.2 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి పథకాలకు ఒక భక్తుడు బుధవారం రూ.2,00,232 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన కొప్పిశెట్టి సుబ్బయ్య ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116, అలాగే గోసంరక్షణ పథకానికి రూ.1,00,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు.